కథాకాలం : 1986

కథా నిలయం
1281
శ్రీకాకుళం

# అసుర సంధ్యా సమస్య

ఏ బెంగా లేకుండా పర్వతాలరావుకి ఆ ఉదయం గడిచిపోయింది. ఏ ఉదయమైనా అతనికి అంతే. రమణి అందించే చిక్కటి కాఫీతోనే అతనికి ఉదయాలు ఉదయిస్తాయి. రమణిని పెళ్ళిచేసుకున్నందుకు అతనికి కలిగిన 'లాభాల్లో' అది కూడా ఒకటి.

ప్రతి దాంట్లోనూ ఏదో ఓ లాభం లేకపోతే జీవించి ఏం లాభం?

ఆ సాయంత్రం మాత్రం అతనికి బిగ్‌క్వెశ్చన్ మార్కులా నిలిచింది. సాయంత్రాలు సుఖంగా ఉండాలంటాడు అతను. లోకంలో అందరికీ కాకపోయినా కనీసం-తనకైనా. లేకపోతే సాయంత్రాలకి అర్థం ఏముంది?

సూర్యుడు దిగిపోడం....చంద్రుడు రావడం.... సుఖం లేకపోతే దేనికి ఉద్ధరించనూ!!

ఉదయాలు ఉదయించినంత సుఖంగా అస్తమించకపోవడం పర్వతాలరావుకి పరమ చిరాకైన వ్యవహారంగా పరిణమించిందీమధ్యన. పైసా ఖర్చు లేకుండా ఏర్పాట్లైపోతేనే అతనికి సుఖంగా ఉంటుంది. పైసలు లేకకాదు ఉన్నాయి. కానీ వాటిని దాయాల్సిన అవసరం కూడా ఉంది. పెన్నీ వైజ్ అండ్ పౌండ్ ఫూలిష్ అన్నారు. ఆ అన్నవాడు ఎన్ని పెన్నీలు.... వైజ్ పెన్నీలు.... పోగేసు కున్నాడో....

ఆ సాయంత్రం అతనికో ప్రశ్నార్థకం కావడానికి కారణం తన అవసరం మరోడికి ఈ పూట కలుగుతుందో లేదో అనే బెంగే.

"సాయంత్రం.... హోటల్ బారాత్‌లో ... ఓకే...." అదీ వినపడాల్సిన విషయం. ఒక్క ఫోను కాల్... బ్రీఫ్ కాల్....పోనీ మనిషే వచ్చి కరచాలన చేసి చెప్పినాసరే....

హోటల్ బారాత్ కాకపోతే కమ్ ఇన్ అయినాసరే సమ్మతమే.

అవసరం వాళ్ళదయితే ఖర్చూ వాళ్ళదే! వాళ్ళకి తనతో కాదు అవసరం, తన సీటుతో. తన సీటులో ఎవరుంటే వాళ్ళతో. యిప్పుడు ప్రస్తుతం ఆ సీటులో వున్నది తను.

ఫోను మోగడంలేదు. పోనీ మనిషీ రావటంలేదు. విసుగు ప్రవేశించింది నరాల్లోకి. బజర్ నొక్కాడు....

ఫ్యూన్ వచ్చాడు.

"కంఠీరవాచార్ని పిల్చుకురా."

కంఠీరవాచారి వచ్చాడు. వేళ కాని వేళ తాను పిలిచాడు. అదీ ఆఫీసు మూసే సమయంలో. కానీ కంఠీరవాచారి ముఖంలో ఎక్స్‌ప్రెషన్ దొరకదు. భయపడుతున్నాడో లేదో ఈ సమయంలో పిలిచినందుకు?

"నమస్కారం!" కారా కిళ్ళీతో గార కట్టిన పళ్ళు బయట పెట్టి మెడ అలవోకగా పైకెత్తి అన్నాడు ఆ ప్రాణి, ఆ రోజు ఒక గంటలో నాలుగు వోచర్లు టేబుల్ మీదికి పంపిన ప్రాణి. గుడ్డిగా సంతకాలు పెట్టి పారేస్తున్నాననుకుంటున్నాడుగానీ ప్రతి సంతకం లెక్కెడుతున్నాడని తెలీదు.

గడ గడ లాడించటానికి నిర్ణయించుకున్నాడు పర్వతాలరావు.... నరాల్లో....విసుగు....

అంతలో ఎదురుగా ఇంటర్‌కమ్ కూత పెట్టింది.

ఆ చప్పుడుకి నరాలు జివ్వున లాగి తివ్వలు పెట్టాయి. కళ్ళు తళ్ళున మెరుపు నింపుకున్నాయి. ఎదురు చూచిన క్షణం! కంఠీరవాచారిని క్షమించి పంపేద్దాం అని నిర్ణయించుకుని స్వింగ్ చైర్‌లో పక్కకి తిరిగాడు.

"సార్" ఆపరేటర్ గొంతు.

"యస్" బేస్‌లోంచి స్వరం లాగాడు.

"మీ కోసం ఇద్దరు వచ్చారు... అనెంప్లాయీసట. పొద్దున్న మిమ్మల్ని కలిస్తే ఈ టైంకి రమ్మని అపాయింట్‌మెంట్ ఇచ్చారట."

ఆశ వాలిపోయింది పర్వతాలరావుకి. ఆమె చెప్పేది వినిపించుకోవాలని లేదు.

అనెంప్లాయీస్!

అతని వళ్ళు మండింది.

తను ఇక్కడ ఓ ముఖ్యమైన కాల్ కోసం వెయిట్ చేస్తున్నాడు.

తన ఎదురుగుండా కంఠీరవాచారి తాను పిలిపించినది ఎందుకో తెలియక అడగబోయే విషయం కోసం వెయిట్ చేస్తున్నాడు.

కాంట్ దే వెయిట్ ఫర్ జస్ట్ ఎ జాబ్?!

పొద్దున్న తను అపాయింట్ మెంట్ ఇచ్చాట్టా....

ఆ పాయింటు పట్టుకుని వచ్చేశారు వాళ్ళు.

అసలు తనే ఇక్కడ అపాయింట్మెంట్ లేక ఏడుస్తుంటే...

"ఆస్క్ దెమ్ టు వెయిట్" ఫోనులోకి ఉరిమాడు.

ఆపరేటర్ "యస్ సర్" అంది. ఆ గొంతులో వినయం, నయం, భయం, తృప్తిగా ఉంది చెవులకి.

తనది అద్దాలగది.

తన సీటు బైటికి కనబడకుండా మధ్యలో రెక్కల చెక్కలు అడ్డు.

ఆపరేటర్‌కి ఆజ్ఞ జారీ చేసినప్పుడల్లా కొంచెం మెడ పైకెత్తి అద్దం లోంచి చూసి ఆమె ముఖం ప్రోబ్ చేయడం అలవాటు. కంపెనీకి ఆ పిల్ల టెలిఫోన్ ఆపరేటర్. తను మాత్రం అదనంగా ఆ పిల్లని తన పి. ఏ. చేసి పారేశాడు. ఆమె అందానికి, చలాకీతనానికి తనిచ్చిన రివార్డు.

విజిటర్స్‌ను వెయిట్ చెయ్యమని తను ఆజ్ఞ జారీ చేసినప్పుడల్లా ఆ పిల్లలో ఆదో రకం గర్వం కొచ్చిట్టొచ్చినట్టు కనిపిస్తుంది. విజిటర్ను మీద మేనేజర్‌గిరీ తనదే అయినట్టు.

ఇప్పుడు కూడా ఆపరేటర్ పిల్ల మొహంలో అదే ఎక్స్‌ప్రెషన్ కోసం వెదకబోయి పర్వతాలరావు కంగుతిన్నాడు.

కారణం-

ఆమె తెచ్చి పెట్టుకున్న చెలాకీతనంతో చేతులు ఊపుతూ ఎదుటి వాళ్ళతో ఏదో అంది రిసీవర్ క్రెడిల్ మీద ఉంచుతూ.

ఆ పిల్ల బల్ల మీదికి వాలిపోయి- ఇద్దరు కుర్రాళ్ళు, బహుశా డిగ్రీ చదువుల ఇంగ్లీషులో కాబోలు- ఏదో జోక్ లాంటిది కట్ చేశారు.

ఆ పిల్ల విరగబడి నవ్వుతోంది పైట అదుపుల్ని తప్పిపోయేలా.

ఈ గ్లాసు డోరు ఇవతల, దూరం నించీ కూడా ఆ పైట దాచలేక పోతున్న గుండెల దగ్గర చర్మం మెరుపు కనిపిస్తోంది.

అతనికి తన సీట్లో దురదగుండాకు పేర్చినట్లుగా ఉంది. దోజ్ అనెంప్లాయీస్.... దిస్ బిచ్....విసుగు నరాల్లో....

ఎదురుగా కంఠీరవాచారి కంఠం సవరించు కున్నాడు.

''చిత్తం....పిలిచార్ట."

"వెయిట్" అన్నాడు కటువుగా అతను.

కంఠీరవాచారి కంఠం అర్ధంటుగా పూడుకు పోయింది.

ఎదుట ఆడదాని మీద కోపం ముంచుకొచ్చి నప్పుడు భార్య మీద ప్రేమ కలుగుతూ వుంటుంది పర్వతాలరావుకి.

తనకి సాయంత్రాలతోనే ఇబ్బంది.

ఉదయం - రమణి చలవ - చిక్కటి పొగల కాఫీ వేడి వల్ల - పేచీ యేమీ లేదు. పాపం పూర్ క్రీచర్... దటీజ్ రమణి.

పెళ్ళయి ఎన్నేళ్ళయిందీ.. ఓహ్...పధ్నాలు గేళ్ళ కదూ.... ఇట్టే గడిచి పోయాయి. లేట్ మ్యారేజ్ చేసుకున్నాడు తను. అసలు ఈ పాటికి చెట్టంత కొడుకో, అరటి గెలంత కూతురో ఎదిగి వుండాలి. ఉంటే వాళ్ళని స్టేట్స్‌కి పంపించేవాడు పెద్ద చదువులకి తలయినా తాకట్టు పెట్టి. అయినా తలెందుకు తాకట్టు పెట్టడం– ఇంత పెద్ద దేశం వుండగా? !

పాపం తమ దంపతులిద్దరికీ ఇంత లేటు వయసులో మూడేళ్ళ పాప. పాపకి సిట్టర్‌ని పెట్టాడు. తోచదని రమణి కోసం పెద్ద ఫారమ్ కొన్నాడు. అందులో పర్ణశాలలా హోమ్ ఆఫ్ రిట్రీట్. ఒక డాగ్ హౌస్ కూడా. అందులో పన్నెండు పప్పీలు. మూడు పోయాయి. రమణి బెంగ పెట్టేసుకుంది. ఏం చేయడానికీ తనకు కాలూ చెయ్యీ ఆడలేదు. మళ్ళీ ఆమె మామూలు మనిషి కావటానికి రెండు రోజులు పట్టింది. ఈ రోజు పొద్దున్నే ఇంకో కుక్క పిల్లకి జ్వరంగా వుందంటూ కంగారుపడింది. లంకంత ఇంట్లో పాపం ఒక్కర్తీ కుక్కలతో సతమతమవుతూ ఎలా ఉందో?

అతను ఇంటికి డయల్ చేసి రమణిని స్వీటీ అంటూ నాటీగా పలకరించి కుక్క పిల్ల యోగ క్షేమం అడిగాడు.

"నేనే ఫోను చేద్దామనుకున్నాను మీకు... జిమ్మీగాడు మూసిన కన్ను తెరవటంలేదు. వెంటనే డాక్టర్ దగ్గరకి కారులో పరిగెత్తాను. ఒక్క

షాక్‌తో కొంచెం కుదుటపడింది. జిమ్మీ ఇప్పుడే మగత నిద్రలోకి జారుకున్నాడు. అన్నట్టు... మీరు ...రాత్రికి ఇంటికి వస్తున్నారా?"

ఇంటికి....తను...విసుగు నరాల్లో చిమ్ము కొచ్చింది పర్వతాలరావుకి. కానీ అది గొంతులో కనబడకుండా జాగ్రత్తగా చెప్పాడు—

"ఓ యస్......నాకు అసలు ఎప్పుడొచ్చి వాలిపోదామా అని ఉంది. పైగా మన జిమ్మిగాడు ఇల్ కదా....కానీ హెవీ వర్క్ అన్ హాండ్. ది మొమెంట్ ఐ గాటాఫ్ విత్ ఇట్....ఐయామ్ దేర్ యూనో....బై" అతను ఫోన్ పెట్టేశాడు తొందరగా విసుగు తరుముకు రాగా.

చాలు ...పూర్ రమణి ...చాలా ప్లీజయి ఉంటుంది. పాపం జిమ్మీకి ఫీవర్ ...ఒక్కత్తే కుక్కతో సతమతమౌతూ....

ఓ ఆలోచన మెరిసింది.

బైట దోజ్ అనెంప్లాయీస్.... పొద్దున్న తనని మీట్ అయ్యారు. సాయంత్రం రమ్మన్నది తనే. ఇద్దరూ ఎమ్.కామ్ ఫస్టు క్లాసో ఏదో. హైలీ క్వాలిఫైడ్ గుమస్తాగిరికి. వెధవ దేశంలో ప్రతివాళ్ళూ ఉద్యోగాలకి ఎగబడే వాళ్ళే. మరో విద్య రాదు. కుక్కల ఆలనా పాలనా చూసుకుంటారేమో నెలకి చెరో రెండొందలూ పారేయొచ్చు.

వెంటనే ఇంటర్ కమ్ ఎత్తి ఆపరేటర్ కమ్ పి. ఏ. పిల్లకి చెప్పాడు. "సెన్డ్ దోజ్ బాయిస్ ఇన్."

టేబుల్ మీద వేళ్ళతో నెర్వస్‌గా లయవేస్తూ డోర్ దిక్కు చూపులు సారించాడు పర్వతాలరావు.

ఇద్దరూ తలుపులు తెరుచుకొని అడుగు పెట్టారు లోపలికి.

ఉద్యోగాలైతే లేకపోయినా ఎరువులు పోసి పెంచిన మొక్కల్లా పొడుగ్గా రివటల్లా ఉన్నారు. చిన్న చిన్న మేధావి గెడ్డాలు పెంచారు. ఒకడు వైట్ రిమ్డ్ గ్లాసెస్ పెట్టాడు. సిగరెట్ రుచే తప్ప అన్నం రుచి తెలియనట్లున్నాయి అతని పెదాలు. రెండోవాడు కూలింగ్ గ్లాసెస్ జేబు లోంచి పైకి తొంగి చూస్తున్నట్లుగా పెట్టాడు. అతని బట్టలు మూడు వారాల క్రితం ఇస్త్రీవే కాబోలు ప్రపంచంలో ఉద్యోగాలన్నీ తన కోసమే ఎదురుచూస్తున్నట్లు ఏమిటి ఆ చూపులో ధీమా? ఆ ఆశలు ఆర్పేయ్యాలి. అప్పుడుగానీ దేశ కాలమాన పరిస్థితులు తెలిసిరావు కుర్రకారుకి. ఇద్దరూ జేబు రుమాళ్ళతో మొఖాలు సెకనుకి రెండుసార్లు తుడుచుకున్నారు. నెర్వస్‌నెస్ కనిపిస్తోంది. మరి డిగ్రీలూ, గెడ్డాలే తప్ప ఉద్యోగాలేవి?

మొత్తానికి కుక్కల ఆలనా పాలనా తెలిసిన వాళ్ళలా లేరు. వాటిని ఎత్తుకుపోయి అమ్మేస్తే...దేశ రహస్యాలకే దిక్కులేని దేశంలో కుక్కలకు ఏదీ రక్షణ ?

"పోనీ నన్ను తర్వాత రమ్మంటారా? బిజీగా ఉన్నారు...." కంఠీరవాచారి ననిగాడు.

"మీరిద్దరూ పది నిమిషాల తర్వాత రండోయ్. ఇతన్ని పంపించిన తర్వాత మళ్ళీ పిలుస్తాను." అనెంప్లాయీస్ ఇద్దరూ ఎదురు చూడ్డానికే అలవాటు పడినట్టు మౌనంగా వినయంగా నిష్క్రమించారు.

"ఆ .... ఏమిటి నీ సంగతి. యస్. చాలా బిజీగా వున్నాను. మా జిమ్మీకి వంట్లో బాగా లేదు" కంఠీరవాచారి ఉనికిని అప్పుడే గుర్తుపట్టి నట్లు అన్నాడు పర్వతాలరావు.

"చిత్తం .... ఊళ్ళో బాగా లేదండీ. అందరికీ జ్వరాలు .... ఫ్లూ ..." కంఠీరవాచారి తనకి తెలిసిన సంగతి చెప్పాడు.

"స్లాంతి పిక్క అరగదీసి" అంటూ చిట్కావైద్యం కూడా సెలవియ్యబోయాడు కంఠీరవం!

"స్టుపిడ్" పర్వతాలరావు విరుచుకుపడ్డాడు —

"జిమ్మీ .... నోరున్న మనిషి కాదు .... నోరులేని పెంపుడు కుక్క. అందుకే దానికి వంట్లో బాగోకపోతే ఇలా డీలా పడిపోవాల్సి వస్తోంది," అంటూ నోరుచ్చుకు పడ్డాడు పర్వతాలరావు.

పని లేకుండా తనని పిలవడం, విషయం చెప్పకుండా విసుక్కోవడం అదంతా ఎందుకో అర్థంకాక కంఠీరవాచారి అవమానం దిగమింగుతూ అలా నిలబడ్డాడు. అతనికి ఆ సెంట్రల్ గవర్నమెంట్ అండర్ టేకింగ్‌లో సర్వీసు ఓ ఏడాదిలో పూర్తి కావస్తోంది.

సాయుధ దళాలకు డీప్ పెన్నిట్రేటింగ్ ఈజీ టేకాఫ్ కంబాట్ ఎయిర్ క్రాఫ్ట్ విడిభాగాలు తయారుచేసే సంస్థ అది. ఆ సంస్థ రిసెర్చి డాక్యుమెంట్లు, మోడర్నైజేషన్ డిజైన్లూ సరిహద్దుల రక్షణకి ఆయువు పట్లు. అందుచేత వాటికి 'గిరాకీ' ఎక్కువ. వాటిని ఎప్పటి కప్పుడు బైటికి పొక్కిస్తూ పబ్బం గడుపుకొస్తున్న పర్వతాలరావు బండారం తెలిసీ ఇలా అవమానం దిగమింగుతూ నిలబడ్డం - మిగిలిన ఏడాది సర్వీసునీ రిటైర్మెంట్ తరువాత మిగిలే కుటుంబ భారాన్ని తలచుకునే.

బైట సూర్యుడు వాలిపోతున్నాడు. చీకటి దుప్పటి కప్పుకోడానికి లోకం సర్దుకు సిద్ధపడుతోంది. రాక్షసులు భోజనాలు చేసే వేళట

అది. అసుర సంధ్యా సమస్య నరాల్లోకి ఇంజక్ట్ అయిన పర్వతాల రావుకి ఎదురుగా తలొంచుకు నిలబడ్డ 'ఘటా'న్ని చూస్తే మొత్తబుద్ధి ఎక్కువయింది. మోగని ఫోన్ వంకా, తిరుగుబాటు చేసే ఓపిక లేని కంఠీరవాచారి వంకా మార్చి మార్చి చూసి "ఈ మధ్యన ఇన్‌సబార్డినేషన్ ఎక్కువైంది నీలో .... ఇనెఫిషియన్సీ పెరిగి పోయింది" అంటూ మొదలు పెట్టి "గేటు బైట నిలబెడతా జాగ్రత్త !" వరకూ వెళ్ళిపోయాడు.

అంతలో -

నిరీక్షించే అలవాటు లేని నిరుద్యోగులు ఇద్దరూ లోపలికి దూసుకొచ్చి అటెన్షన్‌లో నిలబడ్డారు.

"సారీ .... 20 నిమిషాలైందని వచ్చాం" నిరుద్యోగులు గుర్తుచేశారు.

"పది నిమిషాలై పోయింతర్వాత రమ్మన్నా కదా?" అన్నాడు పర్వతాలరావు.

"ఉద్యోగాల కోసం కదూ వచ్చారు. టేక్ యువర్ సీట్స్" అని ఆ ఇద్దర్నీ కూర్చోబెట్టి.

"మీకు కుక్కల ఆలనాపాలనా తెలుసా?" అని అడిగాడు పర్వతాలరావు.

పోస్టు గ్రాడ్యుయేట్లిద్దరూ అనుకోని ప్రశ్నలకు అలవాటు పడ్డట్లు మెదలకుండా కూర్చున్నారు.

"గవర్నమెంట్ అండర్‌టేకింగ్‌లో ఉద్యోగం కోసం సంచుల్తో సర్టిఫికెట్లతో వచ్చి ఎగబడ్డ మీకు .... మీరు కోరుకున్న ఉద్యోగం ఇవ్వలేను కాబట్టి డిగ్నిటీ అఫ్ లేబర్ నేర్పుదామని ఉత్సాహపడుతున్నాను.

చెప్పండి. మేలు జాతి ఆల్సేషియన్ కుక్కల ఆలనా పాలనా చూడ గలరా .... కమాన్ చెప్పండి ...."

పర్వతాలరావు చూపులు నిరుద్యోగుల గెడ్డాల్లో చిక్కడిపోయాయి. వాళ్ళ పోస్టుగ్రాడ్యుయేట్ పొగరు చూపులు ఇబ్బంది పెడుతున్నాయి "మొగని పోను...తిట్లు భరించే కంఠీరవాచారి...ఇమ్‌పేషెన్స్ ....

అంతలో మేధావి గడ్డాలు ఊడిపోయేలా నిరుద్యోగులిద్దరు పగలబడి నవ్వారు. హాలు అదిరిపోయింది. పర్వతాలు బెదిరిపోయాడు.

"కుక్కల్ని చెప్పుతో కొట్టడం ఒక్కటే తెలుసండీ మాకు" అంది ఒక నిరుద్యోగి కంఠం.

"థాంక్స్ ఫర్ ది కాల్ లెటర్" అంది రెండో పోస్టుగ్రాడ్యుయేట్ స్వరం.

ఇద్దరూ అలా కుర్చీలో దర్జాగా కూచుని కేర్లెస్‌గా కాసేపు నవ్వి నిష్క్రమించారు.

"క్రూరాళ్ళు కత్తుల్లా ఉన్నారు. బేవో" అనుకున్నాడు కంఠీరవాచారి.

"చూశావా, జిమ్మి బాధ్యత పీళ్ళిద్దరికీ అప్పచెబ్దాం అనుకుంటే ఎంత పొగరుగా అవకాశం కాలదన్నుకొన్నారో .... కుక్కల్ని చెప్పుతో కొట్టడం ఒక్కటే తెలుసట. అందుకే ఉద్యోగాలు దొరక్క చెప్పులరిగి పోతున్నాయి వెధవ లిద్దరికీ అవునా" తన జోక్‌కి తానే సంతోషించు కుంటూ కంఠీరవాచారితో అన్నాడు పర్వతాలరావు.

"చూడండి. కుక్కల ఆలనాపాలనా మన ప్రభుత్వాలకి బాగా తెలుసు నని నాకో డౌట్ బయల్దేరిందండి. లేకపోతే మొరిగే మీరు, తిట్లు తిని



గూడుచాలని సుఖం

పడుండే నేనూ ఇలా హాయిగా ఉద్యోగాలు చేసుకొంటూ, క్లాసిఫయిడ్ ఇన్ఫర్మేషను నోట్ల కట్టలకి అమ్ముకుంటూ" ... నిరుద్యోగ శక్తి ఆవహించిన ఉద్యోగిలా కంఠీరవాచారి యాక్సిలేటర్ రైజ్ చేస్తుంటే ఉన్మాదిలా అరిచాడు పర్వతాలరావు ''యూ ఫూల్....గెట్ లాస్ట్....''

కంఠీరవాచారి కదిలాడు .... కదలికకే నిర్వచనంలా.

"చూడండి. ఆ కుర్రాళ్ళిద్దరూ చెప్పుతో కొడతామన్నారే .... అది కనకపు సింహాసనం మీద శునకాలని .... వస్తా.''

కంఠీరవం వెళ్ళిపోతూ విసిరిన బాణం పర్వతాలరావు ఆయువుపట్టుకి తగిలింది.

అంతలో ఎదురుచూసిన ఫోను మోగింది. ఓ బేరం కుదిరి ఆ సాయంత్రం సుఖంగానే అస్తమించింది అతనికి. లేకపోతే పాపం. ఏమైపోయి ఉండేవాడో ....!!